# నేడే ఓట్ల కౌంటింగ్

## అభ్యర్థుల్లో ఉత్కంఠ ఆసక్తిగా చూస్తున్న ఓటర్లు

అశ్వారావుపేట, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ఘట్టం ముగిసిన తర్వాత అందరూ ఓట్ల లెక్కింపు కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1,55,961 మంది ఓటర్లు ఉండగా 1,35,501 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 68,895 మంది, పురుషులు 66,602 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానున్నది. అధికారులు కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ఫలితం కోసం పోటీ చేసిన అభ్యర్థులతోపాటు ఓటర్లూ ఆసక్తిగా చూస్తున్నారు. 14 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి కానున్నది. మధ్యాహ్నం వరకు ఫలితాలు వెలువడే అవకాశం ఉన్నది.

### ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్ పంచాయతీల వారీగా పందేలు

చండ్రుగొండ, డిసెంబర్ 2: శాసనసభ ఎన్నికల ఫలితాలపై గ్రామాల్లో జోరుగా బెట్టింగ్స్ కొనసాగుతున్నది. మండలంలోని 14 పంచాయతీల్లో పందెంరాయుళ్లు వేలాది రూపాయాల్లో బెట్టింగ్ కాస్తున్నారు. ఏ అభ్యర్థి గెలుస్తారు? ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది ? పార్టీకి ఎంత శాతం ఓటింగ్ వస్తుంది? అనే అంశాలపై బెట్టింగ్స్ జరుగుతున్నాయి. జూదరులు మధ్యవర్తుల వద్ద సొమ్ము ఉంచి వారితో పర్సంటేజీల మాట్లాడుకోవడం గమనార్హం. తిప్పనపల్లి, రావికంపాడు, రేపల్లెవాడ, తుంగారంలో పందేల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు మండలవాసులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఆదివారం సాయంత్రం వరకు ఫలితాల కోసం అందరూ ఎదురుచూడాల్సిందే.

# నేడు అమలులో 144 సెక్షన్

## రాజకీయ పార్టీల విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

టేకులపల్లి/ఇల్లెందు/ ములకలపల్లి, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సందర్భంగా టేకులపల్లి సర్కిల్ పరిధిలో విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై గన్ రెడ్డి రమణారెడ్డి, ఇల్లెందు సీఐ కరుణాకర్, ములకలపల్లి ఎస్సై సాయికిషోర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ 5వ వరకు అమలులో ఉన్నందున ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. సర్కిల్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పటాకులు సైతం కాల్చొవద్దని సూచించారు. ఓడిన వారిని ఎగతాళి చేసినా, గేళి చేసినా సహించేది లేదని హెచ్చరించారు. ఎక్కడా గుంపులు గుంపులుగా గుమిగూడవద్దన్నారు. డీజేలు పెట్టినా, ర్యాలీలు నిర్వహించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

# జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం, డిసెంబర్ 2: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే అర్చకులు స్వామికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున మంగళవాయిద్యాల నడుమ ఆలయం తలుపులు తెరిచి పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం పట్టువస్త్రాలు ధరింపచేసి ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు పాలపొంగళ్లు తయారుచేసి స్వామికి నివేదించారు. అదేవిధంగా ఆలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ మృతిచెందిన పీ వెంకటరత్నం గ్రాడ్యూయేట్ అకౌంట్ రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య పీ లక్ష్మికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు బీ.శ్రీనివాస్, ముఖ్యఅర్చకులు విజయదేవశర్మ, సుదర్శనశాస్త్రి, సీనియర్ అసిస్టెంట్ కే.విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధిర: అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు**

మధిర, డిసెంబర్ 2: స్వామి అయ్యప్ప ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాస్తమాన పూజాకార్యక్రమాల్లో భాగంగా అయ్యప్పను ఆలయంలో ఊరేగిస్తూ పూజలు నిర్వహించారు. అయ్యప్ప దీక్షాస్వాములు పాల్గొని స్వామిశరణం అయ్యప్ప శరణమంటూ చరణాలు చెబుతూ పూజలు చేశారు. పూజాకార్యక్రమానికి మధిర సహకార సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్, ఆయన సతీమణి, వార్డుకౌన్సిలర్ బిక్కి అనిత పాల్గొని పూజలు చేశారు.

ఎర్రుపాలెం: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, లక్ష్మికి రూ.2లక్షల చెక్కు అందజేస్తున్న ఆలయ ఈవో జగన్మోహన్‌రావు,

### వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ఘనంగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారిని అభిషేకించారు. అర్చన చేశారు. వేడుకను వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆలయ సిబ్బంది వారికి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లును పర్యవేక్షించారు.

### దిబ్బగూడెంలో పంట కోత ప్రయోగం

వరి కోత ప్రయోగం రైతుకు వివరిస్తున్న శ్రీను

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 2: దిబ్బగూడేనికి చెందిన రైతు సింగమ్మ వరి పొలంలో శనివారం జీవా ప్రాజెక్ట్ సీఆర్పీ శ్రీను, ఆర్‌వైఎస్‌ఎస్ ఈపీఆర్పీ మేరిమణి పంటకోత ప్రయోగం కార్యక్రమం చేపట్టారు. ఈ పద్ధతిలో 5X5 సైజ్‌లో రిబ్బన్ కట్టి దానిలోని వరి కంకులను లెక్కించి, దాని ప్రకారం ఒక ఎకరాలో ఎన్ని క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందనేది తెలుసుకున్నారు. ఎకరాకు 19 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధులు, కమిటీ సభ్యులు జయరాజు, మల్లయ్య, కుంజా నాగేశ్వరరావు, మొడియం రాములమ్మ పాల్గొన్నారు.

### మద్యం దుకాణ నిర్వహణపై ఫిర్యాదు

దమ్మపేట, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మద్యం దుకాణంపై ఆ ప్రాంతానికి చెందిన మహిళలు ఎక్సైజ్ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణం నివాసాల మధ్యలో ఉన్నదని, మందుబాబులు మద్యం తాగి నిత్యం గొడవలు పెట్టుకుంటున్నారని, చుట్టుపక్కన నివసిస్తున్న వారికి ఇబ్బంది కలిగిస్తున్నారని అశ్వారావుపేట ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దుకాణం తొలగించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై 'నమస్తే' ఎక్సైజ్ అధికారులను సంప్రదించేందుకు యత్నించగా వారి నుంచి స్పందన లేదు.

### స్వల్పంగా పెరిగిన పామాయిల్ గెలల ధర

అశ్వారావుపేట, డిసెంబర్ 2: పామాయిల్ గెలల ధర స్వల్పంగా పెరిగింది. అక్టోబర్‌తో పోలిస్తే నవంబర్ నెలకు టన్ను ధర రూ.258 పెరిగింది. అక్టోబర్‌లో టన్ను గెలల ధర రూ.12,196 ఉండగా నవంబర్‌లో రూ.12,454కు చేరింది. పెరిగిన ధర నవంబర్ నెలలో ఫ్యాక్టరీకి గెలలు తరలించిన రైతులకు మాత్రమే వర్తిస్తుందని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు. ఆయిల్ రికవరీ పెంపునకు రైతులు నాణ్యమైన గెలలను ఫ్యాక్టరీకి తరలించాలని సూచించారు. పచ్చి గెలలు తరలిస్తే ఆయిల్ రికవరీ తగ్గుతుందని, ఆ ప్రభావం ధరపై పడుతుందని స్పష్టం చేశారు. గెలలు సేకరించే సమయంలో ఆయిల్ ఫెడ్ క్షేత్ర సహాయకుల సూచనలు పాటించాలని కోరారు.